కథా నిలయం
శ్రీకాకుళం

# వాన కురిస్తే

— కేతు విశ్వనాథరెడ్డి

వానకురుస్తే. ఒక్కవాన అదునుకు కురుస్తే—ఆశనిండిన కళ్ళతో ఆకాశంలో కదులుతున్న మబ్బుల్ని చూస్తూ అనుకున్నాడు పాపయ్య. వాన కురుస్తే, మిరపకు పులక అవసరం ఉండదు. సెనక్కాయ విత్తవచ్చు సేద్యాలయినాయి. నిమ్మచెట్టుకు నీళ్ళ పారకం బాధ తప్పుతుంది. తొమ్మిది మట్లు తెగినా ఒక అరెకరంకూడా పారకానికి రాని నీళ్ళున్న బావిని చూస్తూ, గాలికి గిలగిలాడుతున్న మిరప మొక్కల్ని చూస్తూ, భవిష్యత్తు చెప్పని చీనీచెట్లనుచూస్తూ పాపయ్య ఆశగా అనుకొన్నాడు: వానకురుస్తే.

అవును ఈ ఏడైనా వానలు అదునుకు బాగాపడితే, ఎకరం మిరప చెట్లు దండిగాకాస్తే, ధరలు పలికితే, మూడెకరాల్లోని పై సెనక్కాయ బాగా పండితే, ఈ తోట్లోనే పై పైరువల్ల నాలుగయిదు వేలు చేతికొస్తుంది. ఈసారి చెట్లను కాపుకు వదిలితే, వానలువచ్చి బావిలో నీళ్ళెక్కితే, నిమ్మ చెట్లమీద తొలికాపుకే హీనంగా నాలుగయిదు వేలు చేతికి రాలుతుంది. వెలి పైరంతా ఖర్చులకుపోనీ, ఏడెకరాలలో జొన్న, పదహైదెకరాల్లో తీగ సెనక్కాయ, పత్తి. ఈ ఏడు సగానికి పైగా బాకీలు తీరతాయి. తప్పక తీరతాయి. బాకీలకన్నా దరిద్రమూలేదు. నరకమూలేదు. బాకీలున్న ఏ కుటుంబమూ ఈ రోజుల్లో ముందుకురాదు. బాకీలున్న మనిషి మనిషి కాడు. తానేం మనిషి? తనకూ, తమ కుటుంబానికీ ఒకప్పుడున్న గౌరవం

ఈనాడుందా? చుట్టుపట్ల పల్లెల్లో, బంధువుల్లో ఒకప్పుడున్న మర్యాద ఇప్పుడుందా? ఈనాడా గౌరవం మర్యాదా ఎక్కడున్నాయి? వాళ్ళందరూ నీ దగ్గర డబ్బులేవు కాబట్టి, నీకాస్తి తరిగిపోయింది కాబట్టి, నీకు బాకీలున్నాయి కాబట్టి, నిన్ను గౌరవించడంలేదు అని ముఖంమీద అనరు. కానీ వెనక అనేకరకాల మాటలంటారు. అవమానిస్తారు. హింసిస్తారు. అందుకే తాను డబ్బు సంపాదించాలనుకొన్నాడు. ఆశకొద్దీ అప్పుచేసి బావి తవ్వించాడు. నమ్మకంకొద్దీ నిమ్మచెట్లు వేసినాడు. కానీ ఆశ చెడ్డది. ఆశ అన్యాయం చేస్తోంది. నమ్మకం చెడ్డది. నమ్మకం ముంచుతోంది. వానల్లేవు. అన్ని బావులలో మాదిరే ఈ బావిలోనూ నీళ్ళు లోతుకు. ఇంకా లోతుకు పోతున్నాయి. ఎక్కడికి పోతున్నాయో? నిమ్మచెట్లే కాస్తే చేసిన అప్పులు ఒక లెఖ్ఖకాదు. తన ఆశా, నమ్మకమూ నెరవేరే విషయం ఏమో కానీ అప్పుల దయ్యం తన్ను పటుకొంది. తన వంశంలో ఏదో పద్ధతిలో, ఏదో కారణానికి. ఏదో దశలో అప్పులు చేయందెవరు? అవును చేయక తప్పేదేముంది? మెట్టనమ్ముకొన్న వాళ్ళు ఎవళ్ళూ బాగుపడరు. ఎప్పుడూ బాగుపడరు. వానలు అదునులో వస్తే బాగుపడతారు. పాపయ్య బాధగా ఆలోచిస్తున్నాడు.

"నిమ్మ చెట్లేసి ఎన్నాళ్ళయింది?" ఆ దోవన పక్కూరికి పోతున్న ఒకరెవరో అడిగారు. ఈ ప్రశ్నతో పాపయ్య లోకంలో పడినాడు.

"అయిదేళ్ళయింది."

కాపుకు విడిచినారా? భూమి బ్రహ్మాండమయిన భూమి. చెట్లకు బాగా లాయికీ అయిందే. ఇంతకూ చెట్లనుచూస్తే నీటి పాశకం తక్కువైనట్లుందే. ఏం? బావిలో నీళ్ళు తక్కువౌతున్నాయా?" మళ్ళీ ప్రశ్నించినాడు.

చెట్లకు భూమి లాయికీ అయిందన్నప్పుడు ఎంతో ఉత్సాహంగా తన పథకాలను అన్నీ చెప్పాలనుకొన్న పాపయ్య నీళ్ళ సంగతి ఎత్తే

వేళకు నీళ్ళుగారిపోయి 'ఆ' అని ముక్తసరిగా సమాధానించినాడు. దారిన పోతూన్న వాళ్ళంతా బావిదగ్గరకు వచ్చి నిలబడినారు. ఇందాకా ప్రశ్నించిన పెద్దమనిషే తన ధోరణిలో చెప్పుకొని పోయినాడు. "ఉహూ లాభం లేదు, ఈ వానలు సరిగ్గా కురవని కాలంలో నిమ్మచెట్లు పెట్టుకోవడం దండగ, ఒట్టి బుద్ధితక్కువ. మా ఊళ్ళో ఒకప్పుడందరూ చీనిచెట్లమీద ఎగబడినవాళ్ళే. నీళ్ళు చాలక చెట్లు కొట్టేసుకుంటున్నారు. ఒక్క బావికే ఇరవై వేలు ఖర్చుపెట్టిన వాళ్లున్నారు. నీళ్ళుంటేనా?"

పాపయ్యకు అతనితో మాటలలో దిగడం ఇష్టంలేదు. వాళ్ళకు దూరంగా తోటలోకి నడిచినాడు ఆ పెద్దమనిషి పక్కన్న వాళ్ళతో తోటల్ని గురించీ, బావుల్ని గురించీ ఇంకా మాట్లాడుతూనే కదలిపోయినాడు. పీడ వదిలింది. అవి పాపయ్యకు ఇష్టంలేని మాటలు. మనసుకు కష్టం కలిగించే మాటలు. వాణ్ణి చంపాలన్నంత కోపం వచ్చింది. లేకపోతే వాడేం మొనగాడా? నీళ్ళెక్కడ బడేదీ తెలిసిన శాస్త్రగాడా? తనకు నీ తెలీదనుకున్నాడా? తానిదంతా ఆలోచించలేదనుకున్నాడా? అదే పనిగా స్వామివార్ని పిలిపించి లగ్నంపెట్టి. చేలో ఇటువైపు ఈ గట్టున బావి తవ్విస్తే ఆ వెధవ లాభం లేదంటాడా? తన బావి సంగతి వాడికేం తెలుసు?

పాపయ్యకు చిరాకూ, కోపం కలిగినాయి. ఒకచోట పడిపోయిన గోడమీద కంపను తొలగించుకొంటూ తోటలోకి ఆ సమయంలో దొంగగా రావాలనుకుంటున్న దున్నపోతుమీద బలంకొద్దీ రాయి విసిరి కసి తీర్చుకున్నాడు.

వాడు చెప్పిందీ నిజమేనేమో। అయినా తొమ్మిది మట్లు దిగినా నీళ్లు సరిగ్గాపల్లేదంటే ఇంకెక్కడ పడతాయి. స్వామివారితో ఈ విషయమే అంటే ఆయనన్నారు, "తప్పకుండా పడతాయి. దేవికూడా అదే చెప్పింది. పైగా నేను లగ్నం పెట్టిన వేళా విశేషం అట్లాంటిది. తూర్పు

దిక్కున ఆ చిన్న పూటవుందే అటువైపు బోరింగు వేయించు. బుగ్గ పుట్టాల నీళ్ళు లోపల్నుంచీ ఎగదన్నకపోతే, జల ఉబక్కపోతే నన్నడుగు. పదాప్పవరు ఇంజనులు రెండు నాల్గించి జొంగుల్తొ కొట్టినా తరగవు చూడు. వీరారెడ్డి బావిలో నేను నీళ్ళు పడతాయని చెప్పితే పల్లేదా? వాక్కు తప్పదు పాపయ్యా."

నిజమేనేమో లేకపోతే నా ఖర్మేమో. బోరింగు వేయించాల లోపల చటువుందో, బండవుందో. స్వామివారి వాక్కు బలం. బోరింగు వేయించాల. కనీసం నలభై యాభై అడుగులు దించాల. కానీ డబ్బు! డబ్బు ఎక్కణ్నుంచి తేవడం? పాతప్పులే తీర్చడానికి భయంగావుందే. కొత్త ప్పుల్ని తేవడమెట్టా? తీర్చడమెట్టా? తేవడం, తీర్చడం, తేవడం బతుకి తేనా?

వానలు దండిగా పడితే ఈ బాధలుండవు ఈ భయాలుండవు. వానలు కురిస్తే బావికి నీళ్ళెక్కుతాయి; బావిలో నీళ్ళెక్కితే నిమ్మచెట్లు ఒక్క కాపుకు విదిలించి కొడతాయి; పైర్లు బాగా పండుతాయి. అట్లాంటప్పుడు మొగవానికి ఒక పదహైదువేల అప్పు లెఖ్ఖ పత్రమా? వడ్డీత్తో సహా నీతికీ నిజాయితీకి కట్టుబడి బాకీల్ని తీర్చే గుణం తమ వంశ రక్తం లోనే వుంది.

పాపయ్య వంశరక్తం గర్వంతో కులికింది. తన అబ్బ అణా పైసల్తో అప్పు తీర్చినాడు — ఆస్తి అమ్మి తీరిస్తేనేంగాక! తన తండ్రి చచ్చిపోతూ ఋణం వుంచుకోకూడదను - అందులోనూ బంధువుల దగ్గర - అంటే తాను కమాషికి వచ్చిన మొదట్లో పదెకరాలు అమ్మి వడ్డీతోసహా తీర్చినాడు. ఇంత నిక్కచ్చిగా బాకీలు తీర్చేవాళ్ళు యీ రోజుల్లో లేరు. అదే మరొకళ్లయితేనా! ఆస్తులు ఎవళ్ళో ఒకళ్ళ పేరబెట్టుకొని సొమ్ము మెవకేసుకొని దొంగ బాండుల్ని పుట్టించి 'ఐపీ' పెట్టి సంపాదించుకుండేవాళ్ళు. నీతికి, అభిమానానికి కట్టుబడకుండా డబ్బు సంపాదన

ఎందుకు? డబ్బు లేకపోతేనేంగాక. ఆస్తి తగ్గిపోతేనేంగాక తమ కుటుంబానికి పరువుంది; ప్రతిష్ఠ వుంది. పరువు ప్రతిష్ఠ లేనివాళ్ళ దగ్గర ఎంత డబ్బుంటేనేం! అంగడి రామిరెడ్డికి కావల్సినంత డబ్బుంది. దొంగసారాయమ్మి, దొంగ సల్ఫేటమ్మి, నానా దొంగగడ్డీ తిని మిగిలించిన డబ్బుంది. ముచ్చొడ్డీలకిచ్చి సంపాదించిన డబ్బుంది. కొంపలు కూల్చిన డబ్బుంది. ఈ రోజుల్లో ఎంత నీతిని విడిస్తే, ఎంత సిగ్గును విడిస్తే ఎంత ఇతర్లను మోసగిస్తే అంత డబ్బు సంపాదించవచ్చు.

రామిరెడ్డి — అతని డబ్బూ, అతని సంపాదనా స్మృతిలో మెదిలేసరికి పాపయ్య మనస్సు అసహ్యంతో నిండిపోయింది. వాడిదగ్గర వెయ్యి రూపాయలు వీల్లేక, ఇబ్బందులకు తట్టుకోలేక వడ్డీకి తెచ్చినాడు. ముచ్చొడ్డీకి నూటి కయిన రూపాయలకు ఎవరికీ తెలీకుండా - కట్టకడపటకు కడుపున పుట్టిన కొడుక్కు, పెద్ద కొడుక్కు తెలీకుండా తెచ్చినాడు. అప్పులు చెయ్యకుండా బ్రతకడం అసాధ్యమైపోతోంది ఏవో ఖర్చులు తగులుతున్నాయి. పెళ్ళిళ్ళ ఖర్చులు, ఇంటి ఖర్చులు, చదువుల ఖర్చులు, రోగాల ఖర్చులు, చావు ఖర్చులు, వానల్లేక ఖర్చులు-ఖర్చులు, బాకీలు. కానీ ఇట్లాంటి బాకీలు, రామిరెడ్డి దగ్గర తెచ్చిన్లాంటి బాకీలు పగవాడుకూడా చేయకూడదు. వాడు ప్రతి నెలా వడ్డీ తీసుకొంటూనే వాయిదా మాత్రం సంవత్సరం పెట్టినాడు. ఇంక మూన్నెళ్ళు — మూన్నెళ్ళకు వాయిదా ముగుస్తుంది. వాన కురుస్తే మిరపకాయలు తొలికోత తెగేసరికి వాడిడబ్బు వాడి మొకాన కొట్టాలి. లేకపోతే వాడు గుంటనక్క. ఇట్లాంటివాళ్ళ దగ్గర అప్పులు చేయకూడదు. పాపయ్యలో దైన్యం ఆవరించింది.

ఆకాశంలో చెడుగుడు ఆడుతున్న మబ్బులు, విడిపోతున్న మబ్బులు, కలుస్తున్న మబ్బులు. గాలి, పూనకం పట్టినట్లు వీసే గాలి. ఉరుము, ఉరుము. అర్జునా! అర్జునా! మెరుపు, మెరుపు కళ్ళనుచెదరగొడుతున్న

మెరుపు. చినుకులు, చినుకుల చిటపట. పాపయ్య హృదయం ఆనందంతో పులకించింది. చినుకులు, పెద్ద చినుకులే. తప్పకుండా ఈ వాళ పెద్ద వానే పడుతుంది. మిరపచెట్లకు పులక, సెనక్కాయ విత్తనం. బావిలో నీళ్ళు. నిమ్మచెట్ల పాదుల్నిండా నీళ్ళు. ఈ కార్తెలోనే పెద్ద వానలు పడతాయని పంచాంగంలో వుంది. ఈ కార్తె నిన్న మొదలైంది. పంచాంగం తప్పను, వాన కురవడం తప్పదు

గబగబా నెత్తిమీద వల్లెవేసుకొని పాపయ్య ఇంటిముఖం పట్టినాడు. ఎక్కువవుతున్న గాలి విసురు. ముసురుకొస్తున్న చీకటి. విసిరికొడుతున్న గాలి. ముఖంమీద చురుక్కుమనే చినుకులు. అంతంతమాత్రం చూపులున్న పాపయ్య. తన శరీర యజ్ఞఫలాన్ని పితృఋణగృహబంధు దేవతలకు అర్పించిన పాపయ్య, తొట్రుపాటులో ఒక చేనిగట్టు తగిలి కింద పడినాడు. పాపయ్య దీనంగా మూలిగి, మోచేతులతో మోకాలిచిప్పల్ని బిగదన్ని మెల్లగాలేచినాడు. గుండెదడ మొదలైంది. మళ్ళీ వస్తుందా? గుండెపోటేమైనా మళ్ళీవస్తుందా? వాన కురుస్తేచాలు. మళ్ళీ రానీ, తాను ఛస్తేనేం? బాకీలు తీరకుండాచావకూడదు. సంసారాన్ని తలెత్తుకొనేట్లుచేసి మరీ చావాలి. ఛీ పాడు ఆలోచన. వానమీద ఈ గాలికెందుకు కసి? కానీ వానవస్తుంది. వస్తోంది. పాపయ్యకు అవ్యక్తమైన భయమూ, ఆనందమూ కలిగినాయి.

ఆలోచనలతోనే ఊరు చేరుకొని నిట్టూర్చినాడు. పంచాయితీ ఆఫీసులో రేడియో వినాలి. ఈ దినం వాన కురుస్తుందని, పెద్ద గాలి వానా వస్తాయని రేడియోవాళ్ళు తప్పక చెప్పుతారు. పాపయ్య పంచాయితీ ఆఫీసు ప్రవేశించినాడు. అక్కడ రాజకీయాలు, ఒకళ్ళ కొంపల్ని ఒకళ్ళు తీసుకొనే రాజకీయాలు. మంచివీ, చెడ్డవీ, అన్ని రకాలవీ రాజకీయాలు.

"ఏం మామా తోటకాన్నుంచేనా?" సుందరరెడ్డి అడిగినాడు.

"ఆఁ ఈవాళ పెద్ద వానే రావచ్చు. వార్తల్లో ఏం చెప్పినారూ?" సమాధానంకోసం నలువువైపూ పాపయ్య చూసినాడు. నలువురూ వాన రావచ్చునంటే ఆత్మతృప్తి వస్తుందని వాళ్ళంటారు.

"ఆఁ. ఆ రాయలసీమలో భారీవర్షం పడే సూచన లున్నాయట! రేడియోవాళ్ళ మాట ఈవాళ నిజమయ్యేట్లే వుంది." ఒక యువకుడన్నాడు.

"రేడియోలో చెప్పినారా? అయితే యిక తప్పకుండా పడుతుంది. మోడ కూడా దండిగా వుంది." తనూ, తన శక్తిని ప్రకటించినాడు పాపయ్య

"పాపయ్యన్నా! రేడియోలో చెప్పినట్లు వానొస్తే దేవుల్లెందు కయ్యా. ఈపాటికి మనమిట్లా వుండేవాళ్ళమా చెప్పు" కరణం అందు కొన్నాడు.

కరణానికేం దొబ్బుతెగులూ 'మనమం'టాడు. మధ్యలో తనకే మైంది. చచ్చేవాళ్ళు తనలాంటివాళ్ళు కానీ – నక్కలా బతుకుతున్నాడు. పాపయ్య లోలోన ఉడుక్కున్నాడు.

'కలికాలం. బ్రహ్మంగారు చెప్పినట్లు ఇప్పుడు రాజ్యం ఏలుతున్న దెవరు?' కరణం మళ్ళీ ప్రారంభించినారు

"ఇప్పుడీ తత్వాలతో ఏంగానీ యీ పదిరోజులూ భజన్లూ, పానక పందేరం యేర్పాటుచేస్తే బాగుండదూ! పాపయ్య మామ విరాటపర్వం న వుతాడు. ఏమంటావు మామా?" సుందర్రెడ్డి అడిగినాడు.

పాపయ్య సమాధానం చెప్పక ముందే కరణం ఉత్సాహంగా అన్నాడు : "అనేదేముంది? పాపయ్యన్న ఎప్పుడైతే యేది కాదన్నాడూ? ఊళ్లో సందా లిప్పుడే మొదలుపెడ్దాం."

"ఈ చెక్క భజన్లు చేయడంకంటే కాస్తా మంచిపని చెయ్య కూడదూ? ఇంతకుముందు చేసిన భజన్లు చాలవా? వానా, వానా బావుల్లో నీళ్ళు అని ఏడుస్తుంటాం కదా? ఏం పెద్ద బ్రహ్మాండం. ఇతర దేశాల్లో ఇన్నూర్లు మున్నూర్లడుగుల లోతునుంచీ నీళ్ళ బయటికి తెస్తున్నారు. మనం ఏదెనిమిది మట్లకే యేడుస్తాం. తాలూకాలు పది రిగ్గులు దించమను.

అగ్గువగా బావులు తవ్వించమను. భూమిలో నీళ్ళు లేకేం. పోనీ మన చెరువును మర్యాదగా కట్టివుంటే కనీసం బావుల్లోనైనా నీళ్ళుండక పొయ్యేవా? అయిదు లక్షలు పోశారు కదా! చాకలోళ్ళు గుడ్డలుతుక్కోడానిక్కూడా నీళ్లు నిలబడవు. ఎట్లా నిలబడతాయి. పోసిన మట్టి కొట్టుకొనిపోతోంటే. దీన్ని గురించి పట్టించుకోరు. ఈ చెరువే వుంటే, ఆ గండికోట ప్రాజెక్టే కట్టివుంటే, పోనీ ఆ తుంగభద్ర ఎగువ కాలువ వచ్చివుంటే మనకిన్ని బాధలుండేవా? వాన దేవుడో అంటూ భజన్లు చేస్తారు కానీ అసలు సమస్యల్ని పట్టించుకోరు." ఆవేశంగా పట్టాభి అన్నాడు. పట్టాభి విజ్ఞానియైన నిరుద్యోగి, ఉద్రేకి.

"అవునయ్యా నీ కేకలయితే బావుండాయి. ఈ సంగతి ఎవర్నడగాల?" ఇతరులను వాదనలోకి దింపడం కరణానికి ఎంతో ఇష్టం. వాదనలో తా నెలాగా దొరకడు. కానీ ఇతర్ల పిలక తనకు దొరుకుతుంది. దొరికితే అవసరమైనప్పుడల్లా నాటకం ఆడించవచ్చు.

"ప్రభుత్వాన్ని." పటాభి తెంచినట్టు సమాధానమిచ్చినాడు.

"ప్రభుత్వమంటే యెవరు? మన రెడ్డి గంగిరెడ్డి; మన ప్రెసిడెంటు సిద్దయ్యనాయుడు; గంగిరెడ్డి బావమరది చెఱువు కంట్రాక్టరు; సిద్దయ్య నాయుని బంధువు ఇంజనీరు! వీళ్ళ నడగ్గలమా చెప్పు" కరణం లౌక్యాన్నంతా ప్రదర్శించాడు.

"అడగలేకేం? మన ప్రభుత్వంలో మరొకరిని మరిచిపోయావే!" గంభీరంగా పట్టాభి అన్నాడు.

"ఎవర్ని!" కుతూహలంగా ప్రశ్నించాడు కరణం. చర్చ పాకాన పడుతోంది. పట్టాభి అంతు తేల్తుంది. ఒక ఆట ఆడించవచ్చు అని మురిసిపోయినాడు కరణం.

"నిన్నే. ప్రభుత్వంలోవాళ్ళు చక్రాలయితే చక్రాల్ని తిప్పే తెలివి

తేటలు నీలాంటివాళ్ళవి కదా!" పట్టాభి చురక తగిలేసరికి కరణానికి కోపం వచ్చింది.

"పెద్దంతరం చిన్నంతరం లేదు. పిల్లొచ్చి గుడ్డు నెక్కిరిస్తాది. పిదపకాలం, పిదపబుద్ధులు" — కరణం అస్త్ర విసర్జనం చేసినాడు.

ఈ రకమైన వాదనలు ఎక్కడికి దారితీస్తాయో పాపయ్యకు అనుభవమే. వీటివల్ల ప్రయోజనం లేదు.

"నాకు ఒంట్లో బాగోలేదు" అని పాపయ్య వీధిలోనికి వచ్చినాడు. ఒకటి రెండు చినుకులు పడుతూనే వున్నాయి. పట్టాభి మాటల్లో నిజం వుంది. రిగ్గుల సంగతి గొప్పగా చెప్పుకుంటున్నారు ఈమధ్య. కానీ మంచినీటి బావులే తవ్వుతారట. నిజంగానే ప్రభుత్వం శ్రద్ధ వుంటే ఇన్ని అవస్థలుంటాయా? పట్టాభి అన్నట్లు వానలు భజనలవల్ల వస్తాయా? పూర్వం వచ్చేవి. ఇప్పుడేమో భజనలవల్ల వాన వచ్చినా రాకపోయినా రాజకీయాలొస్తాయి, ఊళ్లో తప్పక. ఎగువవీధి భజనగుంపు, దిగువవీధి భజనగుంపుల మధ్య. చెరువు నిలిచివుంటే బావుల్లో నీళ్ళుండేవి — వంకకడ్డంగా కట్టదల్చిన చెరువు కాబట్టి, ఒక పెద్ద వాన కురిసినా చెరువులో నీళ్లు దండిగా వుండేవి చెరువు నిలిస్తేనా! అదెందుకు నిలుస్తుంది? తుంగభద్ర కాలవొస్తే తన భూమి అయిదెకరాలు పారుతుంది, అది వచ్చేదెప్పుడు! అందరూ దొంగలే. ఈ మనుషులు బాగుపడరు. ఈ ఊరు బాగుపడదు, ఈ దేశం బాగుపడదు. అందరూ చస్తారు. అప్పుల్తో చస్తారు. పనికిమాలిన రాజకీయాలతో చస్తారు. పాపయ్య మనసులో కసి, గుండెలలో మంట.

పాపయ్య ఇంటికి చేరుకొని భార్యను ఆత్రంగా అడిగినాడు.

"పైన గవాసులూ అవీ వేయించావా, గుమ్మళ్లేమైనా పడ్తాయేమో. మిద్దెమీద సవుకుంది కదూ."

"ఆ ఈ వాన వచ్చిందా సచ్చిందా." పాపయ్య భార్య వేదాంతం పలికింది.

ఏమైనా వాన వస్తే యీ యింట్లో వుండడం ఇబ్బంది. ఈసారి వానలు బాగా కురుస్తే, పంటలు బాగా పండితే మిద్దె ఊడబీకి తిరిగి కప్పించాల. దంతెలు పుచ్చిపోయినాయి. నాయన కొత్తమిద్దే కట్టాలనుకున్నాడు కానీ కట్టకుండానే వెళ్ళిపోయినాడు. తాను కొత్తది కట్టకపోయినా పాతదైనా పదిలం చెయ్యాల. ఈవాళ యీ మోడాన్ని చూస్తే పెద్దవానే పడుతుంది. గుమ్మళ్లు పడతాయేమో, పడితే రాత్రంతా జాగారం తప్పదు.

"ముందు తొందరగా భోంచెయ్యి, గబ్బునూనెకూడా అయిపో వచ్చింది. ఏం కొంపో?" భార్య సణుక్కుంటూ చెంబుతో నీళ్ళిచ్చింది. చెంబందుకొని మసికట్టుకుంటున్న కిరసనాయిలు దీపంవైపుచూస్తూ "పెద్దోడెక్కడికి పోయినాడూ!" పాపయ్య ప్రశ్నించినాడు.

"నీ వెంతకూ రాకపోయేతలికి నీకోసం తోటదగ్గర కొచ్చినాడే. ఎదురుపడ్లేదా. అంత పొద్దుపోయిందాకా ఆ తోట దగ్గర ఉండకపోతే కారిపోయిందా?" పాపయ్య భార్యకు జీవితం విసుగునిచ్చింది. తప్ప.

ఇంకేమీ ఇవ్వలేదు.

పెద్దకొడుక్కు తనమీద తగని ప్రేమ. తన కొడుకులంతా అట్లాంటివాళ్ళే. ఇప్పుడీ చీకట్లో తనకోసం తోటదగ్గర కెళ్ళినాడు. "వాడు వానలో చిక్కుకుంటాడేమో" పాపయ్య అన్నాడు. "నీకీ మద్దెన వానపిచ్చి పట్టింది." పాపయ్య భార్య వడ్డిస్తూ అంది.

పాపయ్య భోజనం ముగించి ఇంట్లోంచి బయటికివచ్చి ఆకాశం వైపు చూచినాడు, చుక్కల్లేవు. మోడమట్లానే ఉంది, ఒకటి రెండు సినుకులు రాల్తానే ఉన్నాయి. పెద్దవాన రానందుకు పాపయ్య విసుక్కున్నాడు. ఈ వాన మళ్ళీ ఏమైనా ఎగదంతుందా? వస్తున్నా వస్తున్నా అని తెగ ఊరి

స్తుంది. ఎగదంతుంది. లేమ ఈ రోజు తప్పకుండా పెద్దవాన వస్తుంది, పంచాగంలో ఉంది, రేడియోలో చెప్పినారు. తన మనసు చెప్పుతూంది. వాన తప్పదు.

నిద్రవస్తూంది- ఇంట్లోకివెళ్ళి మంచంమీద పడుకున్నాడు. ఉబ్బరంగా ఉంది. తెగ ఉబ్బరంగా ఉంది గాలేమ. వానొస్తే తర్వాత చూసుకో వచ్చు. పాపయ్య మంచం బయట వేసుకొని పడుకున్నాడు పగలంతా తోటకాడ పని, ఆలోచనలూ ఆశలూ నిరాశలు.అలసిపోయిన పాపయ్యకు వెంటనే నిద్ర కమ్మింది.

నిద్రలో పాపయ్యకు ఒక కలవచ్చింది. పెద్దవాన పడుతోంది. చెరువునిండింది. తోటపక్కన్నే గట్టుల్ని యెగదంతూ పారుతున్న కాలవ బావిలో నీళ్ల పాదుల్లో నీళ్ల ఇంట్లో నీళ్లు, వీధిలో నీళ్ళు, తనమీద నీళ్లు. ఎక్కడచూచినా నీళ్ళు. తాను రాసిచినా బాడు కాగితాలన్నీ నీళల్లో కొట్టుకొని పోతున్నాయి. ఎర్రటి మిరప్పండు బాగా ఊరిన సెనక్కాయలు చీనీపండ్లను మద్రాసుకు మోసుకపోతున్నలారీలు రూపాయలు — అన్నీ రూపాయలే, రూపాయల్ని తాను వెదజల్లుతున్నాడు. అంగడి రామిరెడ్డి ఆబగా ఏరుకుంటున్నాడు. కానీ వాడు నీళ్ళల్లో కొట్టుకొనిపోయి చెరువులో మునిగిపోతున్నాడు, మునిగిపోతున్నాడు, పోతున్నాడు.

ఉన్నట్టుండి ఉరిమిన ఉరుముకు కలచెదిరింది. మంచంలోంచీ ఙగ్గున భయంతో లేచిన పాపయ్యకు గుండె వేగంగా వేగంగా కొట్టుకొంది, ఆర్తనాదంచేసి పాపయ్య మంచంలోనే కూలిపోయినాడు. ఆకాశంలోంచీ ఆ రాత్రి వానపల్లేదు, ఇంట్లో వాళ్ళ కళ్ళల్లోంచీ పడింది. ఇంటో వాళ్ళ గుండెలు చెరువులయినాయి. పాపయ్య శవాన్ని చేయించిన స్నానపునీళ్ళ కాలువలు గట్టినాయి.

ఉదయం ఊళ్ళో వాళ్ళంతా పరామర్శించడానికి వచ్చినారు. పాపయ్య పెద్దకొడుకు మల్లయ్యను పక్కకు పిలిచి మందరెడ్డి అన్నాడు.

"ఇప్పుడు విచారించి లాభమేముంది? జరిగే పని చూడాలి. పాపయ్యమామ బతికినన్నాళ్లూ బయటపడకుండా బతికినాడు. కొంత అప్పుల బాధేదో ఉన్నట్లుంది నాతో అనేవాడు. ఏప్పుడన్నా. మీ నాయన లోతు మనిషి. నీకేమైనా చెప్పినాడా?" పాపయ్య తనకూ్కడా బాకీ ఉండేసంగతి సుందర్రెడ్డి చెప్పకుండా జరిగేపని చూడమని మల్లయ్యకు చెప్పినాడు. మల్లయ్య దుఃఖాన్ని దిగమింగుకొంటూ అన్నాడు "నే నెప్పుడూ ఆయన ఏం చేసినా ఒక్కమాట అడగలేదు. అప్పులున్నాయని తెలుసు. ఎంతుండాయో తెలీదు. ఎన్ని బాకీలున్నా తప్పకుండా తీరుస్తాను మామా తీరుస్తాను. మా వంశం సంగతి నీకు తెలీదా? గొంతులో ప్రాణం ఉన్నంత వరకు ఒకరికి బాకీలు ఎగవేయం"

అంగడి రామిరెడ్డి భుజంమీద చేయవేసి మల్లయ్యతో నెమ్మదిగా అన్నాడు.

"చూడు మల్లయ్యా! ఈ మద్దెన మీ నాయన నాదగ్గర చేసిన బాకీవి గూర్చి దిగులు పెట్టుకోవద్దు. తొందరేం లేదులే. నిదానంగా చూసుకో వచ్చు. దివసం అయ్యాక అంతగా అయితే రాతకోతలూ అవీవుంటే చూసుకోవచ్చు."

రామిరెడ్డికూడా మంచోడే. ఇట్లాంటి వాళ్ళు వుండబట్టే తన యింటి గౌరవం నిలిచింది. మల్లయ్య కళ్లు కృతజ్ఞతతో మెరిసినాయి రామిరెడ్డి ఆత్రగాడుకాదు. గాలానికి బాగా చిక్కిన తర్వాత చేపను బయటవేస్తాడు. ఈ చేప బాగా దొరుకుతుంది. రామిరెడ్డి మనసులో అంకెలు దొర్లు తున్నాయి.

దివసాలు ముగిసినాయి. మల్లయ్యకు ఇంటి విషయాలన్నీ నెమ్మ దిగా పడుతున్నాయి. "తండ్రి మరణానికి ముందు మల్లయ్య పొలం పను లను గూర్చి మాత్రమే ఆలోచించేవాడు —తండ్రిదే పెత్తనం కాబట్టి. ఇప్పుడు పొలం పనులు, ఇంటి బాధ్యతలు, బాకీలూ, డబ్బు బాధలూ.

నెలరోజుల తర్వాత మల్లయ్య ఒకరోజు తోటదగ్గరకు వెళ్లినపుడు బావిగట్టున నిలబడి అనుకున్నాడు. నాయన పోయాక ఒక వానవచ్చింది. ఇంకొక మంచివాన కురుస్తే ఈ మిరపచెట్లకు కాయ బాగా పడుతుంది. ధరలున్నాయి. సెనక్కాయ తీగ బాగా సాగుతుంది. ధరలు పెరుగుతున్నాయి. నిమ్మచెట్లకు పూత వస్తుంది, రెండుమూడు లారీలు కాస్తాయి. బావిలో నీళ్ళు సరిపోతాయి అన్నీ కుదిర్తే ఏముందీ! బాకీలు సుమారుగా తీర్చవచ్చు. బాకీలెంతబాధ! బాకీలు తీర్చాలి. బావిలోకిచూస్తూ, ఆకాశం వైపుచూస్తూ, ఆ మధ్యవచ్చిన ఒకవానతో బ్రతకలేక చావలేక అవస్థ పడుతున్న మిరపచెట్లనుచూస్తూ. నీరెత్తని నిమ్మచెట్లనుచూస్తూ అనుకొన్నాడు. ఒక్కవాన కురుస్తే మరొక్క వాన కురుస్తే.... (1971)

(ఆంధ్ర పత్రిక సౌజన్యంతో.)

కథా నిలయం
శ్రీకాకుళం